


"లెగండి! లెగండి! పాపం ఆడ కూతురు బండి కింద పడింది!"

"ముందు డాక్టర్ని పిలవండయ్యా!"

అందరూ కలిసి ఒకేసారి కేకలు పెడుతున్నారు. దూరాన ఎద్దుబండి ఆగింది. సైకిలుమీంచి ఒకతను కిందికి దిగాడు. పొలంపనిమీంచి యిళ్ళకి తిరిగి పోతున్న రైతులు పరుగున వచ్చారు. అయిదు నిముషాల్లో లారీ చుట్టూ చాలా మంది జనం మూగారు.

మిణుకు మిణుకు మంటూ అక్కడక్కడా లాంతర్లు. చుట్టూ పొలాలు, బయళ్ళు. ఒట్టి పల్లెటూరు. అక్కడికి మంచి ఆసుపత్రి 5,6 మైళ్ళు వుంటుంది. గాయమా చాలా పెద్దది. తక్షణం ఆ లారీలోనే తీసుకుని రోగిని ఆసుపత్రి చేర్చ నిశ్చయించారు. లారీడ్రైవరు ప్రాణం బిక్కు బిక్కు మంటోంది. నిజానికి తప్పు అతనిది కాదు. ఆ స్త్రీదే. కానీ రక్తం మడుగులో వున్న ఆమెని చూడగానే అతని ఒళ్లు తూలిపోయింది.

* * *

చిన్న ఆసుపత్రి. 10,15 మంచాలు. నర్సులు, డాక్టర్లు—సౌకర్యానికి తక్కువ లేదు. పెద్ద డాక్టరువచ్చి ప్రమాదం లేదని చెప్పేవరకూ పల్లెటూరిమూక యిళ్ళకి పోనేలేదు.

తెల్లని దుప్పటి కప్పిన నవారు మంచం, పక్కగా కిటికీ, టేబిలుమీద మందులు, కూజాలో మంచినీళ్లు—కస్తూరి కళ్లు తెరిచేసరికి అదంతా మరో లోకంలా వుంది. సగం మెళకువ సగం మగత—

కొమ్మూరి ఉషారాణి

కస్తూరి తెరిచిన కళ్ళు మళ్ళీ బరువుగా మూసుకుంది.

"ఏమమ్మా! ఒళ్ళు సరేనా? అయినా చూస్తూ చూస్తూ అంత పెద్దలారీ కింద ఎలాపడ్డావ్?"

ఎవరో ముసలమ్మ గుమ్మందగ్గిర నిలబడి కస్తూరి కేసి చూస్తోంది. ఆమెని దగ్గిరకి రమ్మని కళ్ళతో సంజ్ఞ చేసింది కస్తూరి.

"పడుకో! పడుకో! మళ్ళీ పెద్ద డాక్టరు చూస్తే కేకలేస్తారు" ముసలమ్మ వెళ్ళిపోయింది

కస్తూరి చేత్తో ముఖం తడిమి చూచుకుంది ఎడం చెంపమీదా, నుదిటిమీద పట్టీలు, కుడిపాదం దగ్గర్నుంచి మోకాలి వరకూ పెద్దకట్టు. ఎంత ఘోరం! తను యింకా బ్రతికివుంది యిలా! ఇదీ భగవంతుని ఆదేశమేనా? గట్టిగా వెక్కిళ్ళతో ఏడుస్తూంది కస్తూరి.

"ఊఁ!ఊఁ! అదే పనికిరాదు. అధైర్యం పడకూడదు" ఆమె కళ్ళవెంట నీళ్ళు ఆగలేదు. అతను తల దగ్గిరగా వచ్చి నిలబడ్డ విషయంకూడా పట్టినట్లు లేదు ఒంగి ఆతను చెయ్యి అందుకున్నాడు పల్సు తీసుకునేందుకు. కస్తూరి తల ఎత్తింది. కళ్ళనిండా నీళ్ళు అడ్డుకుంటున్నాయి. మసక మసకగా వుంది కొంగుతో కళ్ళు తుడుచుకుని మళ్ళీ చూసింది. డాక్టర్! దిక్కులేని పల్లెలో తనకి ప్రమాదం జరిగితే ప్రాణం పోశాడు. నిజం! ఇతనే! కస్తూరి అతని కేసి చూస్తూ అలా వుండిపోయింది. ఎక్కడో చూసినట్టున్న ఆ ముఖం మెల్లిగా గుర్తుకురావటం ప్రారంభించింది.

కస్తూరి అప్పుడే ఇంటరు ఫస్టియరులో ప్రవేశించింది అందరూ అందంగా వుందని మెచ్చుకునేవారు. నిజంగా చూడ చక్కని ముఖం, కాస్తంత ఎక్కువగానే తెలివి తేటలు, బోలెడంత ఉత్సాహం, బాధ్యతా బరువూ లేని మనసు, చిన్నతనం పెద్దతనం మిశితమైన చిలిపితనం — యివన్నీ కలిసిన కస్తూరి అమ్మకీ నాన్నకీ ఒక్కతే కూతురు, అన్నయ్యకి ముద్దు చెల్లెలు, అభిమానవతి, ... ఆశయాలు ఆకాశంలో తేలుతుంటాయి ధైర్యం వుంది, అణకువ కూడాను—యివన్నీ కస్తూరిని బాగా ఎరిగున్నవాళ్ళకి తెలిసే విషయాలు

నిజానికి ఇవన్నీ ఒక ఎత్తు కస్తూరిలో వున్న ఛారమ్ (charm) ఒక ఎత్తు కస్తూరి నవ్వితే ఆకులన్నీ పచ్చ పచ్చగా వూగుతున్నట్లూ, పువ్వులన్నీ అందంగా విచ్చుకుంటున్నట్లూ, మబ్బులన్నీ విడిపోయి చంద్రుడు తొంగిచూస్తున్నట్లూ, ఏదో హాయి అనిపిస్తుంది మనసుకి కస్తూరి మాట్లాడితే ఆ మాటల పొందిక, కళ్ళల్లోని కాంతి, మనిషిని ఆపి నిలబెడతాయి. కస్తూరివి సన్నని పొడుగాటి చేతులు, నాజూకైన వేళ్ళు, మాట్లాడు

తున్నప్పుడు, నడుస్తున్నప్పుడు, ఆ చేతుల్ని మహా అందంగా తిప్పేది. మనిషిలోని అందమంతా ఆ చేతుల్లోనూ, లాలిత్యంలోనూ వున్నాయా అనిపిస్తుంది.

మరి ఇలాటి ఒక్కగానొక్క కస్తూరిని త్వరంగా ఒక ఇంటిదాన్ని చేయాలనీ, మంచి వరుణ్ణి తేవాలనీ సంకల్పించారు తల్లిదండ్రులు. ఎన్ని సంబంధాలు వెతికారో, ఎంతమందిని చూశారో లెక్క లేదు. రెండేళ్ళు గడిచాయి. ఇంకా ఏ సంబంధం కుదరలేదు. కస్తూరి మనసులో ఏముందోగానీ ఈ విషయం పూర్తిగా తల్లితండ్రులకి వదిలేసి తటస్థంగా వూరుకుంది.

మూడు పువ్వులు ఆరు కాయలుగా వున్న ఆ కుటుంబానికి ఇంతలో ఒక పెద్ద విఘాతం ఏర్పడింది కస్తూరి తండ్రి హటాత్తుగా గుండె ఆగి మరణించాడు. అంతా 24 గంటలన్నా పట్టలేదు. డాక్టరు రావటమేమిటి, కళ్ళు మూయటం ఏమిటి అంతా నిముషంలో జరిగిపోయింది. ఇంట్లో పెద్ద దిక్కు పోవటంతో ఆ కుటుంబం పడ్డబాధ, ఎదుర్కొన్న పరిస్థితులు చాలా హృదయ విదారకమైనవి

ఈ దెబ్బ, కస్తూరి జీవితంలో పెద్ద మార్పు తెచ్చింది. ఆర్థికంగా వాళ్ళ పరిస్థితులు అట్టే మారలేదు. సొంతయిల్లు, గొడ్డు గోదా యివన్నీ అలాగే నిలిచాయి. ఎటొచ్చీ తండ్రి వ్యాపారం సుబ్రమణ్యం



“పడుచు పెళ్ళామనా అంత మిడిసిపాటు? నేను బతికుండగా ముక్కు పుడకైనా చేయించావూ?”

చేతిలోకి తీసుకున్నాడు. అంతేకాదు, కస్తూరి పెళ్ళి విషయం అతని భుజాలపై పడింది. ఈ అంశం కస్తూరిని బాగా వూపివేసింది. తన యిష్టా యిష్టాలు, ఆశయాలు అలావుంచి, అన్నా ఒదినలకి తను అట్టే కాలం బరువు కాకూడదని నిశ్చయించుకుంది. తల్లి ఒంటిగా కన్నీరు పెట్టుకోవటం చూసినప్పుడల్లా, కస్తూరి మనసు కోతపడినట్లు వుండేది.

తల్లి విచారం పిల్లలకి తెలియనిచ్చేది కాదు. అన్నా ఒదినలు తరుచు వాదులాడుకునేవారు గానీ అది ఫలానా అని పైకి పొక్కేది కాదు. గుండెల్లో సూదులు గుచ్చుకుంటున్న బాధనైనా సరే యిట్టే మరుగున పడేసి, గంభీరంగా మసిలేది కస్తూరి ఒకరి మనసు

ఒకరికి తెలియనీయకుండా అలా కాలం గడుపుతున్న ఆ కుటుంబంలో ఓ కొత్త వ్యక్తి ప్రవేశించాడు. అతను శర్మ.

పుట్టింది పెద్ద వంశంలోనే. కానీ దైవానుకూలం లేక చాలా కష్టాలు పడ్డాడు జీవితంలో. తల్లి దండ్రులులేరు, చుట్టాలు స్నేహితులు చూపిన ఆదరాభి మానాలతో పెరిగి పెద్దవాడయాడు. డాక్టరీ చదువుతున్నాడు. తెలివిగలవాడు. మంచి భవిష్యత్తు వుంది. అతన్ని యింట్లో పెట్టుకుని, చదువు పూర్తి చేయించి,చెల్లెలి కిచ్చి వివాహంచేయాలని సంకల్పించాడు సుబ్రమణ్యం. అతనికి ఈ వుద్దేశ్యం ఎందుకు కలిగిందో, ఎలా కలిగిందో తెలియదు. ఆ విషయం తెలిసి నప్పుడు శర్మే చాలా చకితుడయ్యాడు.

పండగ నెపం మీద ఓ 10 రోజులు శర్మని యింటికి ఆహ్వానించాడు సుబ్రమణ్యం ఈ విధంగా కస్తూరి, అతను ఒకర్ని ఒకరు తెలుసుకునేందుకు వీలు అని ఆలోచించాడు. కానీ ఆ 10 రోజులు కస్తూరికి పది యుగాలుగా గడచిపోయాయి. శర్మ అందగాడు కాదు. పైపెచ్చు కాస్త అనాకారి కూడాను. చామన చాయ, వెడల్పు ముఖం, లావు పెదిమలు, పొట్టిగా అంద వికారంగా వున్న చేతులు_ఒడ్డూ పొడుగు కాస్త ఈ లోపాలని కప్పిపుచ్చుతున్నా కస్తూరికి "వరుడు" అనగానే, ఎవరైనా ఆశ్చర్య పడక మానరు. రూపమే కాదు; అతను అన్న ఆధారంపై చదువు పూర్తి చేస్తా డన్న విషయం కస్తూరిని బాధ పెట్టింది. అతని మాట, నడక, యింట్లో సంచరించే పద్ధతి_ఏదో దైన్యంగా, వెలితిగా, అవమానకరంగా తోచింది ఆమెకి. అతను పలకరిస్తే సమాధానం చెప్పేం దుకుగానీ, కనీసం ముఖంకేసి చూసేం దుకూ మనస్కరించక అభిమానంతో కుంచించుకు పోయింది

అతను మటుకు చాటుగా కస్తూరికేసి చూసేవాడు చిన్నగా నవ్వేవాడు. పలక రించ ప్రయత్నించేవాడు. ఆమెని ఆక ర్షించేందుకు తంటాలు పడేవాడు కానీ ఇవేమీ కస్తూరి మీద పని చేయలేదు. కస్తూరి మనసు తెలుసుకోవాలని ఓ మాటు ఏకాంతంగా వున్నప్పుడు మాట్లా డించి చూశాడు శర్మ. కస్తూరి అతన్ని చూసి సిగ్గుపడుతున్నట్లుగానీ, భయపడు తున్నట్లుగానీ కనపడలేదు తన ఈ ప్రస్తుత దుర్భర పరిస్థితి కంతా అతనే కారకుడైనట్లు అయిష్టంగా చూసింది అతని వంక. కానీ ఏదో మాట్లాడాలని తొందర వుంది ఆమెకి. అది ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో మటుకు తెలియ లేదు.

"మీతో ఒక విషయం చెప్పాలి ఎవరూ రాకముందు" అంది.

అతను ఉలిక్కి పడ్డట్లు చూశాడు.

"మీ పుణ్యమంటుంది! ఈ పెళ్ళి ఆగి పోవటానికి మీరుతప్ప నాకింక సహాయం



చేసే వాళ్ళెవ్వరూ లేరు. మీ చదువుకి కావలసిన డబ్బు కావాలంటే నేను యిస్తాను అందుకని నా జీవితం పాడు చేయకండి". తలుపు దగ్గిర అలికిడి అయింది. కస్తూరి గబగబ లోపలికి పరుగెత్తింది.

ఆ యింట్లో ఎవరికీ అన్నహితవు లేదు ఆవేళ. శర్మ తలనొప్పిగా వుందని గదిలో పడుకున్నాడు. సుబ్రమణ్యం విస్తరిముందు కూర్చున్నాడేగానీ అన్నం ముట్టలేదు కొడుకు చెప్పినపిదప పిడుగులాటి వార్తతో కుప్ప కూలిపోయింది తల్లి ఆడబిడ్డ సంబంధం కలవక పోవటంతో రుసరుసలాడుతోంది ఒదిన మనసు ఆ కుటుంబంలో నిజానికి కస్తూరి ఒక్కర్తే ఆరోజు కులాసాగా వుండవలసిన వ్యక్తి ఎందుకంటే శర్మ తాను ఆమెని పెళ్ళాడననే విషయం యింట్లో అందరికీ తెలియజేశాడు.

ఆరోజు కస్తూరి మళ్ళీ అతనికి ఎదురుపడింది ఆశ్చర్యమో, విచారమో, దైన్యమో తెలియదు. అతను కస్తూరికేసి చాలా చిత్రంగా చూశాడు

రాత్రి బాగా చీకటి పడుతోంది. దీపాలన్నీ ఆర్పి యింట్లో అంతా పడుకున్నారు కస్తూరి ఆరుబైట వరండాలో కూర్చుని ఆకాశంకేసి చూస్తోంది. ఆకాశంలోని ఒక్కోనక్షత్రం కోటి నక్షత్రాల వెలుగుని ప్రచురిస్తున్నాయి ఆమె కళ్ళకి. తెగిపోయిన వీణ తంత్రులన్నీ మళ్ళీ మీటుతున్నట్లు మనసు కలకలలాడింది. జీవితంలోని పెద్ద విఘాత మేదో తొలగిపోయినట్లు హృదయం తేలికపడింది. శర్మకి అలా కాదు. ఆకాశంలో అసలు నక్షత్రాలే కనపడటం లేదు బీటలు వారిన నేలలా మనసంతా బరువుగా, కలతగా వుంది అవమాన భారంకంటే, నిరాశకంటే, మనోబాధ

ఎక్కువగా వుంది. ఆ కుటుంబంమీద చాలా ఆశలు పెట్టుకున్నా డతను. కస్తూరిని మనసారా ప్రేమించాడు కూడా.

ఉదయం అతను వెళ్ళిపోయింది తెలియదు కస్తూరికి. ఇంకా తనని పలకరించ చూస్తాడనీ, కాస్త డబ్బయినా తను యివ్వవలసి వస్తుందనీ, అన్నతో తనమీద చెబుతాడనీ ఎన్నో అనుమానాలు పెట్టుకుంది కానీ అవేమీ జరగలేదు అతను ఎప్పుడు వెళ్లాడో, ఎలా వెళ్లాడో తెలియదు ఎవరికీ.

* * *

చాలా రోజులు గడచిపోయాయి. కస్తూరికి అడపా, తడపా ఏవో సంబంధాలు వస్తున్నాయి, పోతున్నాయి. ఈ లోపున బి. ఏ. పూర్తిచేసింది. బి. టి కి కూడా కట్టింది కొందరి జీవితాల్లో దాన్ని దురదృష్ట మనాలో మరే శాప మనాలో తెలియదు ఎవరూ ఊహించని కోరుకోదాని పరిస్థితులు ఏర్పడతాయి కస్తూరి ఆ కోవకి చెందినదే ఆమె పెళ్ళి విషయం అందరికీ ఎంత తొందరగా, ఆదుర్దాగా వుందో అంత వెనక పడటం ప్రారంభమయింది.

మరో రెండు సంవత్సరాలకి కస్తూరి తల్లి కన్ను మూసింది తన విషయం కనుక్కునేందుకూ, తన తరపున మాట్లాడేందుకూ, తన కన్నీళ్ళల్లో పాలు పంచుకునేందుకూ వున్న ఒక్క మనిషిని కోల్పోయింది కస్తూరి. ఆ వూరు మారారు మనుష్యులూ కొద్దిగా మారుతున్నారు. అన్నయ్యకి చిరాకు, కోపం ఎక్కువయాయి ఒదిన సంసారంలో పొదుపు ప్రారంభించింది కస్తూరి వుద్యోగంలో చేరింది. ఆ వూళ్ళో కాదు, మరో చిన్న పల్లెలో.

కస్తూరి ఆత్మ హత్య చేసుకునేందుకు లారీ కింద పడిందా? చూస్తూ చూస్తూ లారీకి ఎదురుగా ఎలా వెళ్లింది? జీవితం మీద విరక్తి కలిగేందుకు బలమైన కారణాలు ఏమైనా ఏర్పడ్డాయా?.. ఇవన్నీ కస్తూరిని ఆసుపత్రి చేర్చిన వాళ్లకీ, తదితరులకీ కలిగిన అనుమానాలు. కానీ వీటిని గురించి డాక్టరు శర్మే చాలా చాలా ఆలోచించాడు కంటికి రెప్పలా నిత్యం ఆమెని కని పెట్టుకు వుంటున్నాడు. ఒంట్లో బలం చేకూరేందుకు ఖరీదైన మందులు యిస్తున్నాడు. మనసుకి ఉల్లాసం కలిగేందుకు కబుర్లు చెబుతున్నాడు. ఆమెని యింతకు క్రితం కలుసుకున్నట్లుగానీ, ఎరిగున్నట్లు గానీ ప్రవర్తించటం లేదు. ఆమె వ్యక్తిగత జీవితంలో ఏమాత్రం కుతూహలం కనబరచలేదు. నర్సులు, ఆసుపత్రి మనుష్యులు మటుకు అతను కస్తూరిని ప్రత్యేక శ్రద్ధతో చూస్తున్నాడని గుసగుసలు ప్రారంభించారు.

ఒకనెల గడిచింది కస్తూరి ఆసుపత్రి నుంచి విడుదలయ్యే రోజు వచ్చింది.

ఆమె ఒంటరిగా ఎలా వచ్చిందో, వెళ్లేప్పుడు అంతే. ఒదినగారికి ఆ సమయంలో సుస్తీగా వుండటంవల్ల తనకి జరిగిన ప్రమాదం గురించి తెలియ పరచనేలేదు అన్నకి నర్సులు, యితర రోగులు కస్తూరికి వీడ్కోలు చెబుతున్నారు. గుమ్మంలో బండి వచ్చి ఆగింది. కస్తూరినలా ఒంటిగా బండి ఎక్కించటం •అందరికీ లోలోపల బాధగానే వుంది.

కస్తూరి తను వెళ్లిపోయేముందు డాక్టర్ని ఒక్కమారు క్షమాపణ కోరుకోవాలనుకుంది ఎందుకో, ఎలాగో, దేన్ని గురించీ ఆలోచించలేదు "క్షమించండి'' అన్న ఒక్క ముక్క ఎలాగో అతనికి వినిపించి, ఆసుపత్రి బైట పడాలని నిశ్చయించుకుంది.

ఆమె బండి ఎక్కేముందు శర్మ హడావుడిగా పరుగెత్తుకు వచ్చాడు

''ఆగండి ! మా యింట్లో కొంత ఆతిథ్యం పొంది మరీ వెళుదురుగాని''.

కస్తూరి తెల్లబోయి అతని వొంక చూసింది.

''నా భార్యా, పిల్లలూ యివాళే దిగారు. ఒక్క పూటయినా భోంచేసి ..''

కస్తూరి మరింత తెల్లబోయింది.

''మీ ఆదరణకి ఏమనాలో తెలియటం లేదు. కానీ త్వరగా వెళ్లాలి ఇప్పటికే చాలా రోజులు శలవు తీసుకున్నాను స్కూల్లో. పిల్లలు నా కోసం కాచుకుని వుంటారు''

కస్తూరి ఈ మాటలు తలవొంచుకునే అన్నది. బండి కదిలింది

* * *


తను అనదలుచుకున్న "క్షమించండి" తీరా అననేలేదు కస్తూరి

కానీ ఆ భావాన్ని ఆమె కళ్ళల్లో చూడగలిగాడు శర్మ.

తమ జీవితాల్లో మునుపెన్నడూ అనుభవించని బాధ, దిగులు కలత పెట్టాయి, వారిరువురి మనసుల్ని ఆ క్షణంలో.

★

"నేటి అవసరాలు"



"మా ఫ్రెండ్‌కి పదిఏళ్ళవాడు ఒక కొడుకున్నాడు పిల్లని తీసుకెళ్ళి ఇప్పుడే మాట పుచ్చేసుకుని కట్నంకింద ఒక పదివేలు అడ్వాన్సుగా ఇచ్చి వస్తున్నా ముందు ముందు గిరాకి పెరుగుతుందేమోనని"